క్లుప్తంగా

వెండినందిపై ఆదిదంపతుల విహారం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు తిరుచా ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం వెండినంది వాహనంపై ఆది దంపతులు విహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం దళితవాడలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం రాత్రి కమనీయంగా సాగింది. ఆలయ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, కళ్యాణి దంపతులతో స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్ల కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు చిమటా శేషగిరి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నాయకులు అడపాల మోహనకృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, శివుని నరసింహులురెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, బచ్చు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు




బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రథోత్సవంతో పాటు కల్యాణం, తెప్పోత్సవం జరుగనున్న నేపథ్యంలో రాబోయే మూడు రోజులు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్సై సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

'శ్రీవెంకటేశ్వర'లో జాబ్ మేళా రేపు


కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది ప్రముఖ కంపెనీలు 500 ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యోగాంధ్ర యాప్‌పై అవగాహన



పొదలకూరు: యోగాంధ్ర యాప్ రిజిస్ట్రేషన్లపై పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యాధికారి వినోద్‌బాబు మాట్లాడారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఏపీ నుంచి రెండు కోట్ల మంది పాల్గొనే అవకాశం ఉందని, ఈ క్రమంలో యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకే డ్రోన్ నిఘా



డ్రోన్‌లో రికార్డ్ అయిన నగరంలోని శివారు ప్రాంతం



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఎస్పీ

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెడుతున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, రామకోటయ్య నగర్, వైఎస్సార్ నగర్, శ్రామికనగర్, బుజబుజనెల్లూరు, డైకస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ఎస్పీ శనివారం స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలపై డ్రోన్‌లతో నిరంతర నిఘా పెడుతున్నామన్నారు. శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ఓపెన్ డ్రింకింగ్‌ను కట్టడి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటితో పాటుగా ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, పేకాట, మత్తు పదార్థాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు డ్రోన్‌ల నిఘా దోహదపడుతుందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను డ్రోన్ల సాయంతో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ మద్యసేవనం చేస్తున్న 15 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆయన వెంట వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

వేగంగా అనుమతులు



హాజరైన టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలు

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ అనుమతుల కోసం అధికారులు, నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా నేరుగా దరఖాస్తుదారుని ఇంటి వద్ద వేగంగా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని తీసుకొస్తున్నట్లుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో పెండింగ్‌లో ఉన్న ప్లానింగ్ అనుమతులపై టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులతో కలిసి మంత్రి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. అవసరమైన అన్ని డాక్యుమెంట్స్ అందించిన దరఖాస్తుదారులకు 72 గంటల్లో అనుమతులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్లు వరప్రసాద్, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నందన్, చీఫ్ సిటీ ప్లానర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పూడికతీత



ట్రంకురోడ్డులోని ఓ వీధిలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపడుతున్నట్లు కమిషనర్ నందన్ తెలియజేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ట్రంకు రోడ్డు కోమల విలాస్ పరిసర ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా శాశ్వత నిర్మాణాలను చేపట్టిన ఓ స్వీట్ షాపునకు రూ.50 వేల జరిమానాను విధించారు. గ్యాంగ్ వర్క్ పూర్తయ్యేంత వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సంబంధిత ట్రాఫిక్ పోలీసులకు సూచనలు చేశారు. భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో పర్యటించి, పెన్నానది రిటైనింగ్ వాల్‌ను ఆనుకొని జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వాటిని తొలగించాల్సిందిగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని తృప్తి క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఎన్టీఆర్ నగర్ రాయపాళెం హరిజనవాడ పరిసర ప్రాంతాల్లో పర్యటించి, రోడ్డును ఆక్రమిస్తూ అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న ఓ భవనాన్ని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మాస్టర్ ట్రైనర్స్‌కు రెండు రోజుల యోగా శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ, ఆయుష్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో మొదటి రోజు సుమారు వంద మంది మాస్టర్ ట్రైనర్స్‌కు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. జూన్ 21నే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 200 మంది వరకు యోగా ట్రైనర్స్‌కు మెరుగైన శిక్షణ ఇచ్చి నెల రోజుల పాటు వీరి ద్వారా గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు యోగా ప్రాధాన్యతను తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందించారు. యోగా గురువులు స్వప్న, వెంకటసుబ్బయ్య, ప్రసన్న శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికార సంస్థ అధికారి యతిరాజ్, జిల్లా ఆయూష్ వైద్యుడు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్భుత విజయాలు సాధించారు



ప్రతిభ చూపిన విద్యార్థినితో బాధ్యులు

నెల్లూరు(టౌన్): ధనలక్ష్మీపురంలోని నారాయణ రెసిడెన్సియల్ బాలికల హాస్టల్, బాయ్స్ హాస్టల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో అద్భుత విజయాలను సాధించారని ప్రిన్సిపాల్స్ నాగమణి, కిరణ్, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఆ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శనివారం విడుదలైన ఎస్ఎస్‌సీ రీ వెరిఫికేషన్ ఫలితాల్లో ఊహాప్రీతి 600కి 599 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా ముగ్గురు విద్యార్థులు 595కి పైగా, 21 విద్యార్థులు 590కిపైగా, 93 మంది విద్యార్థులు 580కిపైగా, 232 మంది 550కిపైగా, 359 మంది 500కిపైగా మార్కులు సాధించారన్నారు. కాగా మంచి విజయాలను సాధించిన ఆయా క్యాంపస్ బాధ్యులను నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాసులురెడ్డి, ఆర్అండ్‌డీ విభాగం అధికారి రాజేష్, కో–ఆర్డినేటర్ రాఘవేంద్రరావు తదితరులు అభినందించారు.

పదవులు అలంకారప్రాయం కాదు

నెల్లూరు సిటీ: ప్రజలతో సత్సంబంధాలు కలిగి పార్టీ కోసం కష్టపడే వారికే పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని, పదవులు దక్కిన వారు అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రూరల్ పరిధిలోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని ఐదు దేవాలయాల కమిటీ చైర్మన్‌లు, పాలకమండలి సభ్యుల ఎంపికపై కసరత్తు చేశారు. పదవుల కేటాయింపుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సమావేశంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మామిడాల మధు, ధర్మవరం సుబ్బారావు, తాళ్లపాక అనూరాధ, విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఈనెల 27వ తేదీ నుంచి కడపలో జరిగే మహానాడుకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తల తరలింపుపై రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి శనివారం సమీక్షించారు. మంత్రి నారాయణ నివాసంలో శనివారం ఆనం భేటీ అయ్యారు. రాష్ట్ర మహానాడుకు జిల్లా నుంచి 50 వేల మంది తరలి వస్తారనే అంచనా ఉందని, అందుకు సంబంధించి రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను సైతం అద్దెకు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర బూత్ కమిటీలో జిల్లా నాయకుడికి చోటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన వడ్లమూడి నరేష్‌నాయుడును పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియంలో క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. దాత వై.విష్ణువర్ధన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఎస్.రాఘవేంద్ర, రాజా రమేష్, చంద్రమౌళి, డీవీ సుబ్బరాజు, విజయమోహన్‌నాయుడు, సుబ్బరామిరెడ్డి, ఖలీల్ బేగ్, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సిబ్బందికి సహకరించాలని కోరారు.

• గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంతినగర్, అంబేడ్కర్ కాలనీ, డీకేడబ్ల్యూ కాలేజీ, కేవీఆర్ పెట్రోల్ బంకు, బట్వాడిపాళెం, నీలగిరి సంఘం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.

• డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్, పొదలకూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయాలు ఉంటాయి.

• వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్, ఎన్‌సీసీ కాలనీ, శివాజీ కాలనీ, డైకస్‌రోడ్డు, ఎన్‌బీటీ కాలనీ, ఇందిరా గాంధీనగర్, సంజయ్‌గాంధీ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉంటాయి.

• ఏకే నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కేశవులనగర్, న్యూ మిలటరీ కాలనీ, చైతన్యపురి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.

• డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని రమేష్‌రెడ్డి నగర్, ఫత్తేఖాన్‌పేట రైతు బజార్, శివాలయం ప్రాంతం, అలంకార్ సెంటర్, మూలాపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.

పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని హరనాథపురంలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వరిగొండ శ్రీనివాసులురెడ్డి సతీమణి శనివారం మృతిచెందింది. ఈ క్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గునపాటి రమేష్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, సీహెచ్ హరిబాబుయాదవ్ తదితరులు ఉన్నారు.

పెద్దాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒక్కొక్కటిగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నాయకులు, డాక్టర్లతో శనివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు సూపర్ స్పెషాలిటీ సేవల్లో భాగమైన గుండె సంబంధిత వ్యాధుల కోసం కార్డియాలజిస్ట్ లేరన్నారు. ఇప్పుడు కొత్తగా డాక్టర్ మంజుల అనే కార్డియాలజిస్ట్ వైద్య సేవలందిస్తున్నారన్నారు. ప్రతి సోమ, గురువారం కార్డియాలజి ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. అలాగే ఇప్పటివరకు న్యూరో ఫిజిషియన్‌గా డాక్టర్ ఫణికుమార్ సేవలందించేవారన్నారు. ఇప్పుడు ఆయనతో పాటు మరో న్యూరోఫిజిషియన్ డాక్టర్ ఆలమంద వెంకట అనుపమ విధుల్లోకి చేరారన్నారు. గతంలో వారానికి రెండు రోజులు ఉన్న న్యూరో ఓపీని ప్రస్తుతం మూడు రోజులకు పెంచబోతున్నామన్నారు. అలాగే యురాలజి, న్యూరోసర్జరీ, సర్జికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజి లాంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని, రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు పెట్టుకోకుండా పెద్దాస్పత్రిలో ఉచిత సేవలు పొందాలని సూచించారు.

కోవిడ్ వార్డు ఏర్పాటు

కరోనా కేసులు మళ్లీ నమోదవుతున్న నేపథ్యంలో పెద్దాస్పత్రిలో ముందస్తుగా 30 పడకలతో పల్మనాలజి విభాగంలో వార్డు ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ సిద్దానాయక్ తెలిపారు. కరోనా పరీక్షలు చేసే కిట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు జనసమూహంలోకి వెళ్ల వద్దన్నారు. మాస్కులు ధరించాలని కోరారు. కరోనా కేసులు నమోదైతే ఎదుర్కొనేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, హెచ్‌డీఎస్ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులుగౌడ్, సభ్యుడు దారా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లకు ఎల్టీపీలుగా అవకాశం



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో ప్రణాళికాబద్ధమైన భవన నిర్మాణాలను రూపొందించేందుకు అర్హులైన యువ సివిల్ ఇంజినీర్లను లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)గా శిక్షణ అందించనున్నామని కమిషనర్ నందన్ తెలియజేశారు. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సూచనల మేరకు ఎస్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆయన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. సివిల్ ఇంజినీర్ పట్టభద్రులను నగర నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తూ ఎల్టీపీలుగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దనున్నామని తెలిపారు. శిక్షణ పొందిన అనంతరం నగరపాలక సంస్థ పరిధిలో నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన ప్లాన్, అనుమతులు తదితర పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన వివిధ అంశాలలో వారి సేవలను వినియోగించనున్నామన్నారు. ఎల్టీపీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రజలందరికీ అందుబాటులో ఉంచుతామని కమిషనర్ తెలియజేశారు.

పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు



నెల్లూరు(బారకాసు): నగరంలో యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నగరంలోని పలు పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. గురువులు యోగాపై అవగాహన కల్పించి యోగసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే మానసిక ప్రశాంతత, ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు, తగ్గిన శారీరక శ్రమ, పెరిగిన ఒత్తిళ్లతో శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోయిందని, దీంతో చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, గుండెపోటు వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో యోగాసనాలతో వాటిని ఎలా దూరం చేయవచ్చో వివరించారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలన్నదే యోగాంధ్ర లక్ష్యంగా వివరించారు. కార్యక్రమాల్లో యోగా గురువులు రమేష్, రవీంద్ర, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి సువార్త మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు వీఆర్సీ మైదానంలో 'అద్భుత సువార్త స్వస్థత మహాసభలు' జరుగనున్నాయని నిర్వాహకులు ఎం.బర్నబాస్, టి.కుమార్, జోసెఫ్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వీఆర్సీ కూడలిలోని బాప్టిస్టు చర్చి డొనీహాల్లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు ప్రసంగీకులుగా చెన్నైకి సువార్తికులు జె.దావీదు, పాస్టర్ డి.లారెన్స్‌దావీద్‌లు హాజరై, దైవ వర్తమానం అందించనున్నారన్నారు. జిల్లాలోని క్రైస్తవ సంఘీయులు, విశ్వాసులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఆయా తేదీల్లో సాయంత్రం 6 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని వివరించారు. సమావేశంలో పాస్టర్స్ హనోక్, ప్రభుదాస్, భాస్కరయ్య, బ్రదర్ రాజేష్, స్వరూప్, ఆశిష్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ శిక్షణా తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎంజీబీ మాల్లో రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత చెస్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్, ఎంజీబీ ఫెసిలిటి మాల్ మేనేజర్ రాజశేఖర్ తొలి ఎత్తులు వేసి తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యతిరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చెస్ క్రీడలో నిపుణుల వద్ద శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉచిత శిక్షణా తరగతులకు తమ ఎంజీబీ ఫెసిలిటి మాల్ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపినాథ్, కోచ్‌లు మధురెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టులు చూపకుంటే కఠిన చర్యలు తీసుకోవాలి

నెల్లూరురూరల్: ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులకు వారి వైద్య రిపోర్టులను చూసే హక్కు ఉందని, వాటిని చూపకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల చేతికి వారి రికార్డులు ఇవ్వడం లేదని, అలాంటి యాజమాన్యాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు.